

జిల్లాలో ముగ్గురు ఏసీపీల బదిలీ

ఖిల్లా, ఫిబ్రవరి 14: జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఏసీపీలు బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్త ఉత్తర్వులను జారీ చేశారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజును మిర్యాలగూడ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించలేదు. బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను నియమించారు. ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖమ్మంలో పనిచేస్తున్న జి.బస్వారెడ్డిని నియమించారు. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.



రియల్ ధమాల్

- జిల్లాలో భారీగా తగ్గిన భూ విక్రయాలు
- నిలిచిన ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు
- అసెంబ్లీ ఎన్నికల నుంచి తగ్గిన క్రయవిక్రయాలు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ తగ్గిన రిజిస్ట్రేషన్లు

నిజామాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కొద్దిరోజుల వరకు మూడు పువ్వులు.. ఆరుకాయలుగా సాగిన రియల్ ఎస్టేట్, ఇళ్ల నిర్మాణ వ్యాపారం ప్రస్తుతం ఢమాల్ అయింది. భూముల క్రయ విక్రయాలు తగ్గిపోయాయి. రియల్ ఎస్టేట్ నుంచి వ్యవసాయ భూముల అమ్మకాల వరకు భారీగా తగ్గిపోయాయి. శాసన సభ ఎన్నికల ముందు నుంచి భూముల కొనుగోళ్లు నామమాత్రంగా జరుగుతుండగా రియల్ భూంతో వెంచర్లు, అపార్ట్ మెంట్‌లు నిర్మాణం చేసినవారికి మాత్రం తిప్పలు తప్ప డం లేదు. ఎన్నికల కోడ్ ప్రభావంతో కొన్నిరోజులు కొను గోళ్లు నిలిచిపోగా పూర్తయిన తర్వాత కూడా అమ్మకాల ఊపందుకోలేదు. అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం చేసిన వారు అమ్మకాలు జరగక ఇబ్బందులు పడుతున్నారు. గతంతో పోలిస్తే గడిచిన ఐదు నెలలుగా రిజిస్ట్రేషన్‌లు కూడా ఎక్కువగా కాకపోవడం వల్ల ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వానికి ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని పది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శాసన సభ ఎన్నికలకు ముందు జరిగిన విధంగా ప్రస్తుతం ప్రతి రోజూ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఎన్నికల సమయంలో డబ్బుల లావాదేవీలు తక్కువగా ఉండడం, దూర ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు అవకాశం లేకపోవడం, కొత్త ప్రభుత్వం మారిన తర్వాత పాలసీల కోసం ఎదురుచూస్తున్నవారు కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో క్రయవిక్రయాలు నిలిచిపోయినట్లు పలువురు భావిస్తున్నారు.

కరోనా తర్వాత భూములకు డిమాండ్

ఉమ్మడి జిల్లాలో కరోనా తర్వాత భూములకు భారీగా డిమాండ్ పెరిగింది. వ్యవసాయ భూములతో పాటు ఇళ్ల స్థలాలకు భారీగా డిమాండ్ వచ్చింది. కరోనాకు ముందు వ్యాపారాలకు, ఇతర అభరణాల కొనుగోలుకు పెట్టుబడులు పెట్టిన వారంతా అప్పటి పరిస్థితులను అంచనా వేసి భూముల వైపు మళ్లారు. వ్యాపారుల నుంచి ఉద్యోగుల వరకు తమకు వచ్చే ఆదాయంలో ఎక్కువ మొత్తం భూ కొనుగోలుకు పెట్టుబడి పెట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల వెంట భారీగా భూములను కొనుగోలు చేశారు. భిక్కనూర్ నుంచి మెం డోరా వరకు ఉన్న జాతీయ రహదారి వెంట వందలాది ఎకరాల భూములను ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజాప్రతి నిధులు, వృత్తి నిపుణులు ఎక్కువగా కొనుగోలు చేశారు. ఇళ్ల స్థలాలకు భారీ డిమాండ్ వీరి కొనుగోళ్లతో పెరిగింది. చిన్న కుటుంబాల వారు కూడా కొంత మిగుచ్చుకుని ఇళ్ల స్థలాలపై పెట్టుబడి పెడుతుండడంతో మున్సిపాలిటీల పరిధిలో, మండల కేంద్రాల్లో భారీగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిసాయి. నిజామాబాద్ కార్పొరేషన్ చుట్టుపక్కల గ్రామాల పరిధిలో ఈ వెంచర్లు ఎక్కువగా వచ్చా యి. మొత్తం చుట్టూ 30గ్రామాల పరిధిలో ఈ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. వీటితోపాటు అపార్ట్‌మెంట్ల నిర్మాణం జోరుగా కొనసాగింది. ఇళ్లస్థలాల కొనుగోలుతో పాటు బ్యాంక్‌ల ఋణాలు వస్తుండడంతో అపార్ట్‌మెంట్ లు కొనుగోళ్లు చేశారు. భూములు, ప్లాట్లపైన ఎక్కువగా పెట్టుబడులు పెట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 2019 నుంచి 2023వరకు ఈ కొనుగోళ్లు ఎక్కువగా జరిగాయి. నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువగా ఇళ్ల స్థలాల అమ్మకాలు జరిగాయి. మండల కేంద్రాల్లో కూడా ఎక్కువ మొత్తంలో భూముల రిజిస్ట్రేషన్‌లు అయ్యాయి. ఈ నాలుగేళ్ల ఎక్కువ మంది తమకు వచ్చే ఆదాయంలో డబ్బును భూములపై పెట్టుబడులకే మళ్లించడం వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌లు భారీగా పెరిగాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌లు అన్ని మండల కేంద్రాల్లో జరగగా, ప్లాట్లు, ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, కామారెడ్డి, దోమకొండ, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డిలో ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ఆధ్వర్యంలోనే రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

శాసనసభ ఎన్నికల షెడ్యూల్ నుంచి ఇప్పటి వరకు భూముల రిజిస్ట్రేషన్‌లు భారీగా తగ్గాయి. ఎన్నికలు పూర్తయినా ఈ రిజిస్ట్రేషన్‌లు పెరగడం లేదు. ఇళ్ల స్థలాల క్రయవిక్రయాలతో పాటు అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పూర్తయినా అమ్మకాలు తగ్గడం వల్ల ఎక్కువగా డాక్యుమెంట్‌ల రిజిస్ట్రేషన్‌లు కావడం లేదు. నిజామాబాద్ అర్బన్, రూరల్, కామారెడ్డిలో ప్రతిరోజూ డాక్యుమెంట్లు వంద వరకు జరిగేవి. ప్రస్తుతం ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజు 40నుంచి 50వరకే అవుతున్నాయి. కొన్ని రోజులు అంతకంటే తక్కువగా 20నుంచి 30వరకే కొనసాగుతున్నాయి. మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, దోమకొండ, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడలో కూడా రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడినా మార్పు మాత్రం రాలేదు. భూముల క్రయవిక్రయాలు భారీగా తగ్గిపోయాయి. మరో పది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వస్తున్నందున మే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

గణనీయంగా తగ్గిన ఆదాయం

ఎన్నికల కోడ్ వస్తే డబ్బుల తరలింపు కూడా ఇబ్బందులు ఉండే అవకాశం ఉండడం వల్ల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌లు గత సెప్టెంబరు నుంచి తగ్గుతుండడం వల్ల ప్రభుత్వానికి కూడా గణనీయమైన ఆదాయం తగ్గినట్లు అధికారులు అంచనా వేశారు. గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలో నెలకు 4500నుంచి 5500 మధ్య డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగేవి వీటి వలన ప్రభుత్వానికి ఆదాయం రూ.13కోట్ల నుంచి రూ.14కోట్ల మధ్య వచ్చేవి. ఎన్నికల నుంచి కొద్దికొద్దిగా రిజిస్ట్రేషన్లు తగ్గుతూ రాగా ప్రస్తుతం 3500నుంచి 4500మధ్య రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ఆదాయం రూ.10కోట్ల నుంచి రూ.12కోట్ల మధ్య వస్తుంది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కూడా తగ్గడం వల్ల ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదాయం తగ్గిపోయింది. రియల్ ఎస్టేట్ కలిసివస్తుందని భారీగా పెట్టుబడి పెట్టిన వ్యాపారులకు మాత్రం ఎన్నికల వల్ల తిప్పలు వచ్చాయి. ఎన్నికల ముందు క్రయవిక్ర యాలు ఎక్కువగా ఉండగా ప్రస్తుతం నామమాత్రపు అమ్మకాలు కొనసాగుతున్నాయి. నిజామాబాద్ చుట్టూ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం అయినా కొనే వారు లేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్‌ల వారు ఖర్చులు చూసుకుని నామమాత్రం లాభాలకు అమ్మేందుకు సిద్ధమైనా ఎక్కువ మంది ముందుకు రావడం లేదు. నిర్మాణదారులు బ్యాంకర్లతో ఒప్పందాలు చేసుకుని వినియోగదారులకు అమ్మకాలు చేస్తున్నారు. ఒకేసారి తగ్గిపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో గడిచిన కొన్ని నెలలుగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీందర్ రావు తెలిపారు. గతంలోలాగా ఎక్కువ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నారు. కొనుగోళ్ల ప్రభావం రిజిస్ట్రేషన్లపై ఉందని ఆయన తెలిపారు.

ఘనంగా జగదాంబ మాతా రథోత్సవం





• బషీరాబాద్‌లో అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులో కొలువుదీరిన జగదాంబా మాతా ఆలయంలో బుధవారం జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణ పంతులు ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. దేవి దీక్షాపరుల మాలధారణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, పూజ, హారతి, మంత్రపుష్పం, సువాసీనులచే అమ్మవారి సామూహిక కుంకుమార్చన, చండీయాగం నిర్వహించారు. సాయంత్రం రథహోమం, రథబలి, రథ ప్రతిష్ఠ, రథోత్సవం, రాత్రికి అమ్మవారి డోలోత్సవం కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నారై పోలీసు విద్యాసాగర్ లావణ్య దంపతులు, కుటుంబసభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రథోత్సవ సందర్భంగా భక్తులు రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. నవ చండీయాగం, బలిహరణ కార్యక్రమాల్లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోదాంను బుధవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల కమీషన్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈవీఎంలను ఫస్ట్‌లెవల్ చెకింగ్‌ను నిర్వహిస్తున్నారు. గోదాంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల పనితీరును ఈసీఐఎల్ ఇంజనీర్లు కలెక్టర్‌కు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాలను తూచాతప్పకుండా పాటించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్, ఉద్యోగులు సాత్విక్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా అంకిత్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన కార్యాలయంలో ఈ బాధ్యతలను చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కలిశారు. ఏటూనాగారం ఐటీడీఏ పీవోగా పని చేస్తున్న ఆయనను ప్రభుత్వం జిల్లాకు బదిలీ చేయడంతో ఈ బాధ్యతలను స్వీకరించారు. ఆయన 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఇక్కడ పనిచేసిన చిత్రమిశ్రను ఏటూనాగారానికి బదిలీ చేశారు.






ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ట్రాన్స్‌జెండర్లపై దాడులను అరికట్టాలి

ఖిల్లా, ఫిబ్రవరి 14: ట్రాన్స్‌జెండర్లపై దాడులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో బుధవారం ఏసీపీ కిరణ్‌కుమార్‌కు ట్రాన్స్‌జెండర్లు వినతిపత్రాన్ని అందించారు. గడిచిన కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల పరిధిలో దాడులు జరుగుతున్నాయని నూర్జహాన్ ఏసీపీకి వివరించారు. కొన్ని చోట్ల ట్రాన్స్‌జెండర్లు తమ ఐడీ కార్డులు చూపించినా చిన్నపిల్లలను ఎత్తుకుపోతున్నారనే అనుమానంతో దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీంతో స్పందించిన ఏసీపీ.. ఎక్కడైనా అలాంటి పరిస్థితి ట్రాన్స్‌జెండర్లకు ఎదురవుతే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

వైభవంగా వసంత పంచమి

- సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- జిల్లా వ్యాప్తంగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు



• ఆర్మూర్‌లో..



• భీమ్‌గల్‌లో..





• నగరంలో..

జిల్లాలో వసంత పంచమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకొన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఆర్మూర్ శాస్త్రీనగర్‌లోని సరస్వతి మందిరంలో న్యాయవాది, కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత సరస్వతి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భీమ్‌గల్‌లోని సరస్వతి విద్యామందిర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో గల సరస్వతి అమ్మవారి ఆలయంలో మహిళలు సహస్ర కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.


-న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్

బధిర విద్యార్థులకు నిర్ధారణ శిబిరం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14: జిల్లాకేంద్రంలోని భవిత కేంద్రాలలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వీ హియర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిజామాబాద్ రూరల్ డివిజన్‌లలో విద్యనభ్యసిస్తున్న బధిర విద్యార్థులకు నిర్ధారణ శిబిరాన్ని బుధవారం శంకర్‌భవన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్యాధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీల ద్వారా గుర్తించబడిన బధిర విద్యార్థులందరికీ ఈ శిబిరానికి తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. 75 మంది బధిర విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఇందులో ఎంఈవో రామారావు, వి హియర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సాహెల్, రోహన్, కుల్‌దీప్ పాల్గొన్నారు.

పంపకాలకు వేళాయే!

» ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
» 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
» తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణభవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

» పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

» మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
» జీహెచ్ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో తిష్ఠవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

» ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుందేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి14: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 16న వామపక్ష పార్టీలు నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్‌జహన్ అన్నారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో పోస్టర్‌లను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేస్తూ కార్మికుల సంఘటిత శక్తిని విచ్ఛిన్నం చేస్తూ కార్మిక పోరాటాలను నిర్వీర్యం చేస్తుందని, మతంపేరుతో కార్మిక వర్గాల్లో సైతం విభజన తెస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య, నాయకులు సాయిలు, యాదవరాజు, వి.సంతోషి, బాలయ్య, ఎండి.రఫీక్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: 16న కార్మిక సంఘాలు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ సమ్మెలో పాల్గొంటామని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రుద్రూరు ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఆశా కార్యకర్తలందరూ పాల్గొంటారని నోటీసులో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ కార్మికుల పట్ల మొండిగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, యూనియన్ అధ్యక్షురాలు ఉమా, మహ్మద్ రఫీ, భూమవ్వ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పెద్దబజార్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అన్నారు. బుధవారం నగరంలోని కోటగల్లిలోగల శ్రామిక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు వేలాదిగా కార్మికులు తరలిరావాలని అన్నారు. ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న హక్కులను కూడా కాలరాస్తూ కార్మిక వ్యతిరేక కోడ్‌లను తీసుకొస్తుందని ఆరోపించారు. ఈనెల 16న నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గంగాధర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కాలనీలో ఒకరి హత్య

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14 : నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో ఒకరి హత్యకు గురయ్యారు. మృతుడు స్థానికంగా నివాసం ఉండే జమీల్‌గా పోలీసులు గుర్తించారు. రోటీ దుకాణం వద్ద జరిగిన గొడవతో జమీల్, సోను మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సోను ఓ ఆయుధంతో దాడి చేయగా ఘటన స్థలంలోనే జమీల్ మృతి చెందాడు. నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసున్నారు. కేవలం ఈ గొడవ వల్లే హత్య జరిగిందా? లేక ఇతర కారణాలు ఉండి ఉంటాయా? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎక్సైజ్ ఎస్సైల బదిలీలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14:ఉమ్మడి జిల్లా పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఎక్సైజ్ ఎస్సైలు బదిలీ అయ్యారు. బిచ్కుందలో పనిచేస్తున్న కె.అభిషేకర్‌ను నిర్మల్‌కు, బోధన్‌లో పనిచేస్తున్న బాలయ్యను మెదక్‌కు బదిలీ చేశారు. ఖమ్మం జిల్లా ఎల్లందులలో పనిచేస్తున్న గోవర్ధన్‌ను భీంగల్ ఎక్సైజ్ ఎస్సైగా నియమించారు. కరీంనగర్‌లో పనిచేస్తున్న ఎం.సింగ్‌ను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్సైగా నిజామాబాద్‌కు బదిలీ చేశారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

నవీపేట,ఫిబ్రవరి14: మండల కేంద్రంలోని దర్యాపూర్‌లో బుధవారం వైఆర్‌జీ కేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయిలు, ఒడ్డె రవి, సవిత, స్వరూప, స్వప్న, పద్మ, తదితరులున్నారు.

అసెంబ్లీకి వెళ్లి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 14: కేసీఆర్ కాళేశ్వరం గురించి అసెంబ్లీకి వెళ్లి చర్చల్లో పాల్గొని ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కుంగిపోవడాన్ని నిర్మాణలోపాలను చూపించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రతినిధి బృందాలతో కలిసి మేడిగడ్డ వెళ్లడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతులపై అసెంబ్లీలో చర్చ జరపడానికి కేసీఆర్‌ను పిలిచిన ఆరోగ్యం బాగాలేదని చెప్పే కేసీఆర్ నిన్న నల్గొండలో జరిగిన బహిరంగ సభకు ఎలా వెళ్లాడని ప్రశ్నించారు. ఇప్పటికైనా అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న చర్చలో కేసీఆర్ స్పందించి అక్కడ జరిగిన లోపాలపై ఇతర అంశాలపై నిజాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కేసీఆర్‌కు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లానాయకులు సురేష్,తదితరులు పాల్గొన్నారు.

సొసైటీకి ఫెర్టిలైజర్ డ్రోన్ వితరణ

నందిపేట, ఫిబ్రవరి14: మండలంలోని ఖుద్వాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సంఘానికి బుధవారం ఇఫ్‌కో కంపెనీ అధికారులు రూ.20లక్షలు విలువ చేసే ఫెర్టిలైజర్ డ్రోన్‌ను ఉచితంగా అందజేశారు. డ్రోన్‌తో పాటు చార్జింగ్ చేయడానికి జనరేటర్, పెద్ద బ్యాటరీలు అదనంగా ఇచ్చారు.అంతే కాకుండా డ్రోన్‌ను తరలించడానికి వాహనాన్ని సైతం ఉచితంగా అందజేశారు. ఫెర్టిలైజర్ డ్రోన్ ద్వారా ఎకరానికి రూ.200 వసూలు చేస్తున్నట్లు సొసైటీ అధికారులు తెలిపారు.

జిల్లాలో నూతన తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామేశ్వర్

మోపాల్, ఫిబ్రవరి 14: మోపాల్ మండల తహసీల్దార్‌గా రామేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఖాజాకుదుబుద్దీన్ బోధన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లాకు చెందిన రామేశ్వర్ మోపాల్ మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఖాజాకుదుబుద్దీన్ కొత్తగా వచ్చిన రామేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. బదిలీపై వెళ్లిన కుదుబుద్దీన్‌కు రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు పలికారు. కొత్తగా వచ్చిన రామేశ్వర్‌కు స్వాగతం పలికారు. ఈసందర్భంగా తహసీల్దార్ రామేశ్వర్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌గా రాజేశ్వరి కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోటగిరి తహసీల్దార్‌గా సునీత

కోటగిరి: కోటగిరి తహసీల్దార్‌గా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలో భాగంగా కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నుండి కోటగిరికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ప్రభాకర్ డిచ్‌పల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. కోటగిరి తహసీల్దార్‌ను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు షాహీద్, ఎంపీటీసీ మనోహర్, కాంగ్రెస్ నాయకులు శంకర్, ఖదర్, అన్వర్, హన్మంతు, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్

మోస్రా తహసీల్దార్‌గా మారుతీ బాధ్యతల స్వీకరణ

మోస్రా: మోస్రా మండల తహసీల్దార్‌గా పీ.మారుతీ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పీ.మారుతీ మోస్రా మండలానికి బదిలీపై వచ్చారు. మోస్రా తహసీల్దార్‌గా పని చేసిన శ్రీకాంత్ రావ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సాయిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి తహసీల్దార్‌గా ప్రభాకర్

డిచ్‌పల్లి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్

డిచ్‌పల్లి:మండల తహసీల్దార్‌గా ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయన్ను పరిచయం చేసుకున్నారు. ప్రభాకర్ గతంలో కోటగిరి మండల తహశీల్దార్‌గా పనిచేశారు.

జక్రాన్‌పల్లి తహసీల్దార్‌గా డి.కిరణ్మాయి

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి తహసీల్దార్‌గా డి.కిరణ్మాయి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ కలెక్టరేట్‌లో సూపరిండెంట్‌గా పని చేసిన డికిరణ్మాయి బదిలీపై జక్రాన్‌పల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇదీ వరకు తహసీల్దార్‌గా పని చేసిన ఎం.ఎ.ఖలీం బదిలీపై రెంజల్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్ళారు.

ఆర్మూర్ తహసీల్దార్‌గా గజానన్

పెర్కిట్: ఆర్మూర్ పట్టణ నూతన తహసీల్దార్‌గా కె.గజానన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్‌లో విధులు నిర్వహించి కె.గజానన్ ఆర్మూర్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

డొంకేశ్వర్ తహసీల్దార్‌గా వెంకటరమణ

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల తహసీల్దార్‌గా వెంటకరమణ బాధ్యతలు చేపట్టారు. గతంలో డొంకేశ్వర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి రాములు బదిలీ కాగా ఆయన స్థానంలో భీమ్‌గల్ తహసీల్దార్ వెంకటరమణ బుధవారం డొంకేశ్వర్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన వివిధ మండలాల ఎంపీడీవోలు

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి14: భీమ్‌గల్ ఎంపిడిఓగా సంతోష్ కుమార్, తహసీల్దార్ సరిత బాధ్యతలు చేపటారు.గతంలో పనిచేసిన ఎంపీడీవోరాజేశ్వర్ కామారెడ్డి బదిలీ పై వెళ్లారు. తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణ కామారెడ్డికి బదిలీపై వెళ్లారు. భుధవారం ఎంపీడీవో సంతోష్ కుమార్‌ను పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

● ఇందల్వాయి ఎంపీడీవోగా అనంతరావు

ఇందల్వాయి:ఇందల్వాయి మండలఎంపీడీవోగా అనంతరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చిన నూతన ఎంపీడీ వోకు మండల ప్రజాపరిషత్ సిబ్బంది శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. కామారెడ్డిలో విధులు నిర్వహించారని బదిలీపైఇందల్వాయికి వచ్చినట్లు తెలిపారు.

● నవీపేట ఎంపీడీవోగా నాగనాథ్

నవీపేట: నవీపేట ఎంపీడీవోగా నాగనాథ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో నవీపేట ఎంపీడీవోగా పని చేసిన సయ్యద్ సాజిద్ అలీ కామారెడ్డి జిల్లాకు బదిలీ కాగా నిర్మల్ జిల్లా బాసర ఎంపీడీవోగా పని చేసిన నాగనాథ్ బదిలీపై నవీపేటకు వచ్చారు.

● రెంజల్ ఎంపీడీవోగా శంకర్

రెంజల్: రెంజల్ మండల ఎంపీడీవోగా శంకర్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇది వరకు పని చేసిన ఎంపీడీవో శంకర్ బదిలీపై సంగారెడ్డి జిల్లా హత్నూర బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కామారెడ్డి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన శంకర్ బదిలీపై రెంజల్ ఎంపీడీవోగా బుధవారం బాధ్యతలు చేపట్టారు.



నూతన ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

జక్రాన్‌పల్లి ఎంపీడీవోగా ఎం.సతీష్‌కుమార్

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి ఎంపీడీవోగా ఎం.సతీష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గాంధారి ఎంపీ డీవోగా ఎం.సతీష్‌కుమార్ బదిలీపై జక్రాన్‌పల్లి ఎంపీ డీవో బాధ్యతలు తీసుకున్నారు.

● ధర్పల్లి ఎండీవోగా బాలకృష్ణ

ధర్పల్లి: ధర్పల్లి ఎండీవోగా బాలకృష్ణ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మణ్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎండీవో బాలకృష్ణ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మోర్తాడ్ ఎంపీడీవోగా తిరుమల

మోర్తాడ్: మోర్తాడ్ మండలం ప్రజా పరిషత్ ఎంపీడీవోగా తిరుమల పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి సంగారెడ్డికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ నుంచి బదిలీపై వచ్చిన తిరుమల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఉద్యోగులు లు నూతన ఎంపీడీవోకు స్వాగతం పలికి శాలువతో సన్మానించారు.

● ముప్కాల్ ఎంపీడీవోగా ముజాఫర్

ముప్కాల్:ముప్కాల్ మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీవో ముజాఫర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా కంకిరి మండలం నుంచి బదిలీపై వచ్చారు. గతంలో పని చేసిన ఎంపీ డీవో దామోదర్ మెదక్ జిల్లా బదిలి కాగా నూతన ఎంపీ డీవోబాధ్యతలు చేపట్టగా ఆయనను సన్మానించారు.

● బోధన్ ఎంపీడీవోగా వెంకటేష్ జాదవ్

బోధన్ రూరల్: బోధన్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడవిధులు నిర్వహించిన ఎంపీడీవో పర్వన్న బిచ్కుందకు బదిలీ అయ్యారు.జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో విధు లు నిర్వహిస్తున్న బోధన్‌కు బదిలీ అయ్యారు.

బాల్కొండ ఎంపీడీవోగా బాధ్యలు స్వీకరణ

ముప్కాల్: బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీవో కేతరి బాస్కర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నిర్మల్ జిల్లా దస్తురబాద్ మండల అధికారిగా పని చేసి బదిలీపై వచ్చారు. గతంలో పని చేసిన ఎంపీడీవో సంతోష్‌కుమార్‌కు కామారెడ్డి జిల్లా సదాశివ్‌నగర్‌కు బదిలి కాగా నూతన ఎంపీడీవోకు బాధ్యతలు అప్పగించారు.

జిల్లా వ్యాప్తంగా వసంత పంచమి వేడుకలు


మోకన్‌పల్లి కేజీబీవీలో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న దృశ్యం


పెంటాఖుర్దు సరస్వతీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


ఆలయంలో సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 14 : వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో గల సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు సహస్ర కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న సరస్వతి అమ్మవారిఆలయంలో వసంత పంచమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆలయకమిటీ ప్రతినిధులు,గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలో సాయిబాబా ఆలయ 21వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వసంత పంచమిని పురస్కరించుకుని ఆలయ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, పుణ్యవచనం, నవగ్రహ షోడశ, మాతృక పూజకం, హోమం, సుప్రభాత సేవ, హారతి, విశేష అభిషేకం నిర్వహించారు. సద్గురు బస్వలింగ అవదూత ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర కొనసాగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

- కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వసంత పంచమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

రుద్రూరు: రాజేశ్వర స్వామి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని ఆలయంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధపాఠశాలల నుంచివిద్యార్థులు సరస్వతి దేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: వసంత పంచమి సందర్భంగా మండలంలోని అన్ని ఆలయాల్లో భక్తులు సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వసంత పంచమిని పురస్కరించుకొని భీమ్‌గల్‌లోని సరస్వతీ విద్యామందిర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.అన్ని ప్రభుత్వప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామంలో వసంత పంచమిని పురస్కరిం చుకొని ముదిరాజ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతి దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని పూజలు నిర్వహించినట్లు యువ కులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అశోక్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెద్దమ్మతల్లి ఆలయ 14వ వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.వసంత పంచమిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘ సభ్యులు ఇంటికొక బోనం తీసి గ్రామంలోని ప్రధాన వీధులగుండా డప్పువాయిద్యాలతో నృత్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మ హిళలు బోనాలతో ఊరేగింపుగావెళ్లి అమ్మ వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘసభ్యులు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని శాస్త్రీనగర్‌లో న్యాయవాది, కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత సరస్వతి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు నంబి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు ఎల్లోల్ల సత్యనారాయణ, దత్తాద్రి, దానే ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాలలోబుధవారం వసంతపంచమి పురస్కరించుకొని విద్యార్థులతో అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలోని జ్ఞానసరస్వతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో వసంతి పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో విద్యార్థులతో అక్షరభ్యాసం," సరస్వతి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వ హించారు. పాఠశాల కరస్పాండెంట్ లయన్ ప్రకాష్ గుజరాతి, ప్రిన్సి పాల్ లత, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. లిల్లిపుట్ పాఠశాలలో వసంత పంచమి సంద ర్భంగా సరస్వతీ అమ్మవారి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. కరస్పాండెంట్ రామకృష్ణ ప్రిన్సిపాల్ దాసు, టీచర్లు ఉన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) డిచ్‌పల్లి వెంకటేశ్వరాలయం, ఖిల్లా రామాలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని భక్తులు బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమి రోజు పలువురు వ్యాపారాలను ప్రారంభించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవీపేట: వసంత పంచమి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోకన్‌పల్లి మాజీ సర్పంచ్ జ్యోతి ఉమామహేశ్వర్ రావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులకు నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి రాణి, చంద్రశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

- **జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో**

మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కొలువైన సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, సీఈవో హరిత గౌడ్ తదితరులున్నారు.

పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


బాలికల పాఠశాలలో భోజనశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి14: ఆర్మూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన సభ వేదిక, భోజనశాల గదిని, ఇతర గదులను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే బాలికలకు టాయిలెట్లు సరిగ్గా లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇక నుంచి అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల ఇబ్బందులు తలెత్తకుండా చూడాలనే ఉద్దేశంతో యుద్ధ ప్రతిపాదికన నిర్మాణాలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆవరణలో చెట్లు పెంచే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వసంత పంచమి పురస్క రించుకొని పాఠశాల ఆవరణలో సరస్వతి దేవికి పూజలు చేశారు. సరస్వతిమాత కృపాతో విద్యా ర్థులు ఉన్నత చదువులు చదివి రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం. ముజీ ముద్దీన్, బీజేపీ నాయకులు మందుల బాలు, నర్సారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీల స్వాగత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న కేశవేణు, తాహెర్, తదితరులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14:ఎమ్మెల్సీగా మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడుగా మహ్మద్ షబ్బీర్‌లు నియమితులైన మొట్టమొదటి సారిగా జిల్లా కేంద్రానికి ఈనెల 16న వస్తున్న సందర్భంగా నిర్వహించే స్వాగత ర్యాలీ, అభినందన సభను జయప్రదం చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్ పార్టీ శ్రేణులను కోరారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తున్న మహేశ్వర్ కుమార్‌గౌడ్, షబ్బీర్ అలీలను అధిష్ఠానం మర్చిపోకుండా ముఖ్యమైన పదవులు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా వారికి పదవులు ఇచ్చిన జాతీయ నాయకులకు, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 16న నిర్వహించే స్వాగత సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తదితరులు పాల్గొంటారని నగర, జిల్లా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. నగరంలోని బోర్గాం బ్రిడ్జి నుంచి వినాయక్‌నగర్, పూలాంగ్, గోల్‌హనుమాన్, పెద్దబజార్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, బస్టాండ్ మీదుగా ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘం వరకు ర్యాలీ నిర్వహించి అభినందన సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. 16వ తేదీ మధ్యాహ్నం నిర్వహించే స్వాగతర్యాలీ, అభినందన సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు రత్నాకర్, జావిద్ అక్రమ్, శేఖర్‌గౌడ్, దయాకర్‌గౌడ్, రాంభూపాల్, అంతరెడ్డి విజయ్‌పాల్ రెడ్డి, గంగారెడ్డి, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు విటమిన్ ఏ అవసరం


పిల్లలకు విటమిన్ ఏ ద్రావణాన్ని అందిస్తున్న దృశ్యం

డొంకేశ్వర్, ఫిబ్రవరి14: ప్రభుత్వ ఆసు పత్రిలో ఉచితంగా లభించే ఏ ద్రావణాన్ని చిన్నపిల్లలకు తప్పనిసరిగా అందించాలని డొం కేశ్వర్ మండల సూపర్‌వైజర్ సురేందర్ అన్నా రు. బుధవారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి, దత్తాపూర్ గ్రామాలలో చిన్న పిల్లలకు ఉచితం గా విటమిన్ ఏ ద్రావణాన్ని అందించే కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు విటమిన్ ఏ లోపించడం వల్ల కంటిచూపు మందగించి రే చీకటి వంటి సమస్యలు వస్తాయని సూచిం చారు. ప్రతీఒక్కరు తప్పకుండా పిల్లలకు మందులను అందించాలని కోరారు.

బాలికల హాస్టల్ ముందు విద్యార్థినుల బైఠాయింపు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 14:తెలంగాణ విశ్వ విద్యాలయంలోని బాలికల వసతి గృహం ముందు బుధవారం మధ్యాహ్నం పెద్దసంఖ్యలో హాస్టల్ విద్యార్థినిలు ధర్నాచేపట్టారు.హాస్టల్‌లో టిఫిన్ సైతం చేయకుండాఆందోళన చేపట్టడంతో ఆందోళన చేస్తున్న చోటుకి రిజిస్ట్రార్ యాదగిరి ఆందోళన విరమిం చాలని కోరిన విద్యార్థినిలు వినిపించుకోలేదు. హాస్టల్‌లో ఉండే విద్యార్థి నిలకు నాణ్యత లోపాలతో వంటలు చేస్తూ అ నారోగ్యానికి గురిచేస్తున్నారని సిబ్బంది ఇష్టారాజ్యం వంటల వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురవుతు న్నారని రిజి స్ట్రార్‌కు ఫిర్యాదు చేయడంతో హాస్టల్ సిబ్బందిపై రిజిస్ట్రార్ మండిప డ్డారు. ఇక నుంచి నాణ్యతలేని వంటలు చేస్తే తగు చర్యలు తీసుకుం టామని ఆందోళన చేస్తున్న విద్యార్థినిల ఎదుట సిబ్బందిని హెచ్చరించడంతో విద్యార్థినిలు ఆందోళన విరమించారు.తమకు మెస్ బిల్లులు కూడా ఇష్టా రాజ్యంగా వస్తున్నా యని భోజనం చేసే దానికంటే బిల్లులు అధికంగా వస్తున్నాయని వాపోయారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకుంటామని రిజి స్ట్రార్ హామీ ఇచ్చారు.

- **ఎంఎడ్ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు 26 నుంచి ప్రారంభం**

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల విద్యార్థులకు ఎంఎడ్ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

మోస్రాలో లీకేజీకి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


లీకేజీ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మోస్రా,ఫిబ్రవరి14: మోస్రా మండల కేంద్రంలోని రామాలయం వద్ద గల అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో మిషన్ భగీరథ పైపు లైనుకు లీకేజీకి మరమ్మతులు నిర్వహించారు.బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ప్రత్యేక అధికారి సాయిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ దగ్గరుండి లీకేజీకి మరమ్మతులు చేయించారు.

ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కమిషనర్


పదవీ బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ ఎ.రాజు

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి14:మున్సిపల్ కార్యాలయంలోని నూతనమున్సిపల్ కమిషనర్‌గారాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు.ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రసాద్ చౌ హన్‌కు సంగారెడ్డికి బదిలీ కాగా ఆయన స్థానంలో మహబూబ్ నగర్ జిల్లా మరిపెడ మున్సిపల్ కమిషనర్ రాజు ఆర్మూర్ మున్సి పల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.

నగరంలో ఆన్‌లైన్ మోసం

- చైన్ సిస్టం పద్ధతిని సభ్యుల చేరిక
- ఒక్కొక్కరి వద్ద రూ.45 వేలు
- మోసపోయిన అమాయకులు
- రూరల్ పీఎస్‌లో కేసు నమోదు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 14: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న మరో నకిలీ ఆన్‌లైన్ దందా వెలుగులోకి వచ్చింది. రూ.45 వేలు చెల్లించి సభ్యత్వం తీసుకుని మరో ఐదుగురిని చేర్పిస్తే ఒక్కొక్కరికి రూ.11,300 ఇస్తామని నమ్మబలికి మోసానికి తెరలేపిన ఘటన జిల్లాకేంద్రంలో జరిగింది. రూరల్ ఎస్‌హెచ్‌వో జి.మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో కేసీఆర్ కాలనీలో గ్రాబెజ్ ఫ్యాషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వెంకటసాయి, కిషోర్ అను ఇద్దరు వ్యక్తులు నిర్వహిస్తున్నారు. వీరు చైన్ సిస్టం ద్వారా ఎక్కువ డబ్బులు సంపాదించే గోల్డెన్ చాన్స్ అంటూ ఆన్‌లైన్ ద్వారా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రకటనలు గుప్పించారు. వీరి వలలో వందల సంఖ్యలో యువకులు చిక్కారు. ఒక్కొక్కరు. రూ.45,500 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలి. వారు మరో ఐదుగురిని చేర్పించాలి. దానికిగాను రూ.11,300 ఇస్తామని నమ్మబలికారు. వీరి మాటలు నమ్మి మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట జన్నారంకు చెందిన మేడిశెట్టి శ్రావణి డబ్బులు పెట్టింది. తర్వాత ఇదంతా మోసపూరిత వ్యాపారమని గ్రహించి తాను ఇచ్చిన రూ.45,500 తిరిగి ఇవ్వమని ఒత్తిడితెచ్చింది. నిర్వాహకులు తన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో సమీపంలోని రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. శ్రావణి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యాలయంలో పదుల సంఖ్యలో టెలీకాలర్లను నియమించి కార్యకలాపాలు సాగిస్తున్నారు. టెలీకాలర్‌లను రూరల్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు. నిర్వాహకులు పరారీలో ఉన్నారు. ఈ నకిలీ ఆన్‌లైన్ మోసంలో జిల్లాకు చెందినవారెవరూ ఫిర్యాదుచేయలేదు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారే ఉండటం గమనార్హం.

పోటాపోటీగా వేలం పాట


మారుతి మందిరంలో వేలం పాట దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 14: బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలోని ఒకటవ మడిగేకు వేలం పాట నిర్వహించగా వేలం పాట పోటాపోటీగా కొనసాగింది. ఈ వేలం పాటలో రాజు పటేల్ అనే వ్యాపారి రెండు లక్షల రూపాయల అడ్వాన్స్‌తో పాటు నెలకు 27,500 కిరాయి చొప్పున వేలం పాటలో మడిగేను దక్కించుకున్నాడని ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ తెలిపారు. వేలం పాటలో వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేలం పాట హోరాహోరీగా కొనసాగిందన్నారు. ఇటీవల ఖాళీగా అయిన ఒకటవ నెంబర్ మడిగేను రాజు పటేల్ అనే వ్యాపారి వేలం పాటలో దక్కించుకున్నారని వివరించారు.

'ప్రజలు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'


సీహెచ్ కొండూర్‌లో చెత్తను పారవేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్ రావు

నందిపేట, ఫిబ్రవరి14: ప్రజలు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు కోరారు. బుధవారం నందిపేట మండలంలోని చౌడమ్మ కొండూర్ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ చైర్మన్ విఠల్ రావు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు. అంతేకాకుండా డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అన్ని పరిసరాలను, ముఖ్యంగా మురికి కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.తాగునీరు కలుషితం కాకుండా వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ అధికారులను విఠల్‌రావు ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవోశ్రీనివాస్‌రావు, ఎంపీవో కిరణ్‌కుమార్,పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, నాయకులు తదితరులు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఆర్‌డీవో పీడీ

నిజామాబాద్‌అర్బన్,ఫిబ్రవరి 14:జిల్లా గ్రామీణ అభివృద్ధి అధి కారిగా సాయాగౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.కామారెడ్డి నుం చి బదిలీపై వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని డీఆర్‌డీవో కార్యాల యంలో ఈబాధ్యతలను తీసుకున్నారు.ఇక్కడ పని చేస్తున్న చందర్‌రాథో డ్‌ను కామారెడ్డికి బదిలీ చేశారు. బాధ్యతలు తీసుకున్న సా యాగౌడ్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును మర్యాద పూర్వ కంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన సాయాగౌడ్‌ను జేఏసీ నేతలు అలుక కిషన్, అమృత్‌కుమార్,శేఖర్,హన్మంత్‌రెడ్డితో పాటు ఇతరులు కలిశారు.

324క్వింటాళ్ల 70కిలోల పీడీఎస్ బియ్యం వేలం


వేలం పాట నిర్వహిస్తున్న తహసీల్దార్ రాంచందర్

రెంజల్,ఫిబ్రవరి14: గత నెల రోజుల క్రితం సివిల్ సప్లై ఆధ్వర్యంలో 324క్వింటాళ్ల 70కిలోల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. 25వేల డిపాజిట్ కట్టి నిర్వాహకులు వేలంలో పాల్గొన్నారు. సాటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి 8,60,450రూపాయలకు వేలంలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేశారని తహసీల్దార్ రాంచందర్ తెలిపారు.వేలం వేసిన బియ్యాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు వేలంలో పాల్గొన్న వ్యక్తికి అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఇద్దరు లైన్‌మెన్ల సస్పెన్షన్

నందిపేట, ఫిబ్రవరి14: నందిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న ఇద్దరు విద్యుత్ లైన్‌మెన్లు సస్పెన్షన్ అయినట్లు నందిపేట ఏడీఈ ఎం అశోక్ తెలిపారు. మండలంలోని చౌడమ్మ కొండూర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న నవీన్, ఖుద్వాన్‌పూర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న వేణుగోపాల్‌లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని తేలింది. దింతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇద్దరు లైన్‌మెన్‌లను సస్పెన్షన్ చేసినట్లు నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ చెప్పారు.

బోధన్ ఏసీపీ బదిలీ

బోధన్ రూరల్, ఫిబ్రవరి 14: బోధన్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారని ఉత్తర్వులు వెలువడ్డాయి. బోధన్ ఏసీపీగా పి.శ్రీనివాస్ ఐటీ సెల్ హైదరాబాద్ నుంచి వస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. త్వరలో శ్రీనివాస్ బోధన్ ఏసీపీగా పూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఎడపల్లి, ఫిబ్రవరి 14: ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో బుధవారం సీతారామాలయ 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా సీతారాములవారికి ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం సీతారాములవారిని పల్లకిలో ఊరేగించారు.ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థులకు డీఐఈవో అభినందన

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14:ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నారాయణ కళాశాల విద్యార్థులను బుధవారం డీఐఈవో రఘురాజ్ అభినందించారు. నారాయణ కళాశాల విద్యార్థిని మర్రి హర్ష 99.62 పర్సంటైల్ సాధించగా, మాలెలిఖిత్ 94.23 పర్సంటైల్, శివరాశికీర్తన 91.63 పర్సంటైల్, ఎంకే సుశ్రీజ 90.78 పర్సంటైల్ సాధించగా వీరిని డీఐఈవో అభినందించారు. పోటీ పరీక్షల్లో మన జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించడం అభినందనీయమని డీఐ ఈవో అన్నారు. ఈ సందర్భంగా నారాయణ కళాశాల బ్రాంచ్ ప్రిన్సి పాల్ కుంట లక్ష్మారెడ్డి, నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ ప్రతాప్, జీఎం శ్రీనివాస్‌రావులు విద్యార్థులను అభినందించారు.ఈసందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్‌లో జేఈఈ మెయిన్స్, ఐఐటీ కోచింగ్‌లో నిష్ణాతులైన 45 సంవత్సరాల అనుభవ జ్ఞులైన అధ్యాపకు లతో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు.స్థాపించిన మొదటి సంవత్సరంలోనే జాతీయ స్థాయి పరీక్షల్లో, ఎంసెట్‌లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం నారాయణ ప్రత్యేకత అన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈవో రఘురాజ్

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,000	రూ.59,000	రూ.735

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : లాల్‌సలామ్ (12.00, 3.15)
: రాజధాని ఫైల్స్ (6.30)
: ఓయ్ (9.50)
స్క్రీన్-2 : ఈగల్ (12.00, 10.00)
: హనుమాన్ (3.20, 6.40)
స్క్రీన్-3 : రాజధాని ఫైల్స్ (1.00)
: ట్రూలవర్ (4.20)
: యాత్ర-2 (7.25, 10.20)
స్క్రీన్-4 : కెమెరామెన్ గంగాతో రాంబాబు (12.25)
: తేరి బాతోంమే అయిసాఉల్జాదియా (3.40, 6.50, 10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఈగల్ (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : రాజధాని ఫైల్స్ (10.35, 1.40, 7.25, 10.30)
: యాత్ర-2 (4.40)
స్క్రీన్-3 : ఓయ్ (10.20, 4.20, 10.30)
: అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ (1.30)
: హనుమాన్ (7.30)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఈగల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : లాల్‌సలామ్ (11.15, 6.15,)
: యాత్ర-2 (2.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్